# <u>పత్రికా ప్రకటన</u>

**తేది.04.12.2017.**

## <u>నకిలీ మందుల కేసు మూలాలు చేధించిన విజయవాడ నగర పోలీసులు మరియు డ్రగ్ కంట్రోల్ శాఖ</u>

ఉత్తరాఖాండ్‌ను కేంద్రంగా చేసుకుని, ప్రముఖ కంపెనీలను పోలిన నకిలీ మందులను తయారు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చలగాటమాడుతూ డబ్బుకోసం అడ్డదారులు తొక్కుతున్న ఘరానా నేరస్థులను విజయవాడ పోలీసులు మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అధికారులతో సంయుక్తంగా అరెస్ట్ చేసి, నకిలీ మందుల తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఈ నకిలీ మందుల వ్యవహారానికి సంబంధించి జాన్సన్ & జాన్సన్ కంపెనీకి సంబంధించి ది. 31. 10. 2017న వచ్చిన సమాచారంతో వెంటనే స్పందించిన నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారు ఒన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ డి.కాశీ విశ్వనాధ్ మరియు టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో కలసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, నకిలీ మందుల తయారీ దారులు, విక్రయ మరియు పంపిణీ దారులను అరెస్ట్ చేసి ఈ నకిలీ మందుల మూలాలు చేధించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

ఈ కేసును అన్ని కోణాల్లో క్షుణ్ణంగా పరిశోధించి దర్యాప్తు చేపట్టగా నకిలీ మందులకు సంబంధించి అనేక విషయాలు వెలుగు చూశాయి. జాన్సన్ & జాన్సన్ మల్టీ నేషన్ మందుల కంపెనీ అల్ట్రసెట్ అనే వారి బ్రాండు మందులను పోలిన నకిలీ మందులు దేశంలో అనేక ప్రాంతాల్లో చలామణిలో ఉన్నాయి. విజయవాడ నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల వివిధ మెడికల్ షాపులలో సోదాలు చేసి సాయి మెడికల్స్ అనే షాపులో అల్ట్రసెట్ నకిలీ మందులను గుర్తించి వాటిపై గల బ్యాచ్ నెంబరు ఎన్ 548 ద్వారా అవి నకిలీవని నిర్ధారణకు రావడం జరిగింది.

*(మిగతా 2వ పేజీలో ...)*

ఈ నేపథ్యంలో సాయి మెడికల్స్ యజమాని పేర్ల రవి కుమార్ ఆ మందులు పంపిణీ చేసిన నరసారావుపేట హరికృష్ణ మెడికల్స్ యజమాని ఫణికుమార్, అతనికి ఆ మందులు పంపిణీ చేసిన గుంటూరు దుర్గా మెడికల్స్ యజమానులు చైతన్య, రామకృష్ణలను అదుపులోకి తీసుకుని విచారించడం జరిగింది. విచారణలో సంబంధిత మందులు వారికి నంద్యాలకు చెందిన పృధ్వీతేజ, అతనికి ఆళ్ళగడ్డకు చెందిన మునిశేఖర్ ఈ నకిలీ మందులను పంపిణీ చేసినట్లుగా వెల్లడైంది. ఈ నకిలీ అల్ట్రసెట్ మందుల తయారీ అసలు మూలాలు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూరుకీ అని తెలుసుకుని, ఈ కేసు పురోగతిలో ఏపి స్టేట్ డ్రగ్ కంట్రోల్ వారి సహకారం తీసుకోవడం జరిగింది.

ఉత్తరాఖండ్ రాష్ట్రం రూర్కీలో మహమ్మద్ నసీము అనే వ్యక్తి ద్వారా విశాల్ అన్సాన్ అనే వ్యక్తి మరికొందరితో కలసి ముఠాగా ఏర్పడి ఈ నకిలీ మందుల తయారీ చేస్తున్నట్లుగా గుర్తించడం జరిగింది. విశాల్ అన్సానే అల్ట్రసెట్ నకిలీ మందులతో పాటు సన్‌ఫార్మాసూటికల్ కంపెనీకి చెందిన పంటాసిట్-డిఎస్ఆర్, పంటాసిట్-40 అనే మందులను పెద్ద ఎత్తున  తయారు చేసి చలామణి చేసినట్లు దర్యాప్తు బృందం గుర్తించింది. ఈ క్రమంలో ది.25.11.2017న రూరుకీ లోని విశాల్ అన్సానేకు చెందిన ఇనోవా డ్రగ్స్ మందుల తయారీ కంపెనీనిపై దాడులు నిర్వహించగా, కంపెనీలో నకిలీ మందులు ఉత్పత్తి అయినట్లు తేలింది. ఈ నేపథ్యంలో నకిలీ మందుల తయారీ యంత్ర పరికరాలైన 1. బ్లిష్టర్ ప్యాకింగ్ మిషన్, 2. టాబ్లెట్ కోటింగ్ పాన్, 3. కంప్రెషన్ మిషిన్, 4. కోన్‌బ్లెండర్ మొదలగు 18 రకాల సామాగ్రిని దర్యాప్తు నిమిత్తం సీజ్ చేసి, ఉత్తరాఖండ్ నుండి విజయవాడకు తరలించడం జరిగింది.

ఈ కేసులో మొత్తం ఎనిమిది మంది నిందితుల్లో తొలుత ఐదుగురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసిన అనంతరం ది.4.12.17న మరో ముగ్గురు నిందితులు ఉత్తరాఖండ్ రూరుకీకి చెందిన ఇన్నోవా డ్రగ్స్ నిర్వహకుడు విశాల్ అన్సానే, ఉత్తరాఖండ్‌కు చెందిన మొహమ్మద్ నసీమ్ మరియు ఆళ్ళగడ్డకు చెందిన శ్రీ లలితశ్రీ మెడికల్స్ నిర్వహకుడు ముని శేఖర్‌లను అరెస్ట్ చేసి, కేసును చేధించడం జరిగింది.

*(మిగతా 3వ పేజీలో ...)*

తొలుత ఈ కేసులో ఐదుగురు నిందితులైన **(1) విజయవాడ సాయి మెడికల్స్‌కు చెందిన పేర్ల రవికుమార్, (2) నర్సరావుపేట హరికృష్ణ మెడికల్స్ ఫణికుమార్, (3) గుంటూరు దుర్గా మెడికల్స్ నిర్వహకులు చైతన్య, (4) రామకృష్ణ, మరియు (5) నంద్యాల మహేశ్వరీ మెడికల్స్ నిర్వహకుడు పృధ్వీతేజ** అనే వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగింది. అనంతరం ఈ కేసుకు సంబంధించి మరో ముగ్గురు నిందితులు **(1) ఉత్తరాఖండ్ రూరుకీకి చెందిన ఇన్నోవా డ్రగ్స్ నిర్వహకుడు విశాల్ అన్‌సానే, (2) ఉత్తరాఖండ్‌కు చెందిన మొహమ్మద్ నసీమ్, (3) ఆళ్ళగడ్డకు చెందిన శ్రీ లలితశ్రీ మెడికల్స్ నిర్వహకుడు మునిశేఖర్** అనే నిందితులను ది.4.12.17న ఒన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేయడం జరిగింది.

ప్రజారోగ్యానికి హాని కలిగించి, ప్రాణాలకు ముప్పును తెచ్చే నకిలీ లేదా కల్తీ మందులు తయారీ, పంపిణీ చట్టరీత్యా నేరం. ఇటువంటి వాటిని ఉపేక్షించకూడదు. తక్కువ కాలంలో సులబంగా డబ్బు సంపాదించి విలాసవంతంగా జీవించాలనుకునే కొంత మంది ఘరానా నేరస్థులు నకిలీ మరియు కల్తీ మందులు తయారీ చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న నకిలీ మరియు కల్తీ మందుల తయారీ కేంద్రాలపై దృష్టి సారించి వాటిని బట్టబయలు చేయడం జరిగింది. విజయవాడ నగర పోలీసులు కమీషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో నకిలీ, కల్తీలు తయారు చేసే కేంద్రాలపై మెరుపుదాడులు నిర్వహించి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరిగింది. దేశంలోనే మొట్టమొదటి సారిగా కల్తీ మందుల పంపిణీ కేంద్రంతో మొదలుపెట్టి తయారీ స్థావరాల మూలల వరకు కనిపెట్టి అతి స్వల్పకాలంలోనే ఈ కేసును చేదించడం జరిగింది.

-- xx --